# "రాగవర్ధని"

'విజయ - రాఘవ'

"అదేమిటి!"

"ఏమిటది!"

"ఏమిటేమిటి! నాతలకాయ యింకా మీకు తెలియలా!"

"ఏమిటే తెలిసేది!"

"ఏమిటో తెలియకుండానే వుందా యిన్నాళ్ళబట్టి! అవున్లెండి. 'తెలిసింది' అంటే పూసగుచ్చినట్లు చెప్పమంటారని, ఒక్క మాటలో తెలియదు అంటే పోతుందిగదా అని వూరుకొన్నారు. అంతేనా!"

"అబ్బబ్బ! వూరికే విసిగించకు. విషయంయేమిటో తేల్చి చెప్పక, యెందుకు దాస్తావ్"

"నిజంగా చెప్పండి! మీరు వినలేదూ!"

"ఏమిటే వినేది?"

"అదేనండీ!"

"అదుగోమళ్ళీ అదే మాటంటావ్. ప్రతిదీ నాన బెట్టటం నేర్చావుగదా!"

"అదైనా, నాకు మాత్రం యెలా తెలిసిందంటే మొన్న సుబ్బులు యేదో పనుండి యిటువైపుకి వచ్చాట్ట. మళ్లా యింటికిపోతూ - పోతూ చూసి వెల్దామని, మనింటికొచ్చాడు."

"ఏమిటిరా కబుర్లూ?" అన్నా.

"ఏముంటయి అక్కాయ్ ......" అంటూ కళ్ళ నీళ్లెట్టుకున్నాడు. వాడికళ్లెంట నీళ్ళొచ్చేసరికి, నాకూ వచ్చాయి సుమా!

"అదేమిటే పిచ్చిదానా! అలాయేడుస్తావ్..."

పిచ్చిదాన్నయ్యాను నిజంగా ఆమాట వినేటప్పటికి. జేబురుమాల అడ్డంపెట్టుకొని వెక్కివెక్కి యేడ్వడం మొదలుపెట్టేశాడు. వాడేంచెబుతాడో అని నాగుండె ఆదుర్దాపడటం యెక్కువయింది "ఏమిటిరా అసలు విషయం" అని అడగబోతుండగా వాడే కళ్లుతుడుచుకుంటూ —

"అన్నయ్య వేరుపడ్డాడు" — అన్నాడు.

ఆ మాట వినేటప్పటికి మెరుపుమెరిసినట్లు నా రెండు కళ్లూ పోయినట్లనిపించింది. "ఏందుకని?" అని అడిగాను.

"ఏదో మాటామాటా వచ్చిందట—" అన్నాడు

"నీకు తెలియదా" అన్నా

"ఎవర్నడిగినా" యింట్లో చెప్పలేదుఅన్నాడు.

"అన్నం యెక్కడ తింటున్నాడన్నా"

"హోటల్లో...!" అన్నాడు.

"ఉండటం...! అన్నా

"మన యింటికి వెనకాల డాబాలో" అన్నాడు. తర్వాత నేనేం అడిగానో, గుర్తులేదు. వాడేదో కబుర్లుకూడా చెప్పుకొచ్చాడు. యిక నేను వినలేక పోయాను. యేది చెప్పినా ఒకవేళ 'సరే' అనిగాని, "ఊ"...అనిగాని, అంటానికి శక్తిలేకుండాపోయింది.

"వెళ్లొస్తా..." అంటూ కాసేపుండి సైకిలెక్కి వెళ్లిపోయాడు.

"మీకెక్కడైనా కనిపిస్తున్నాడా మా అన్నయ్య!"—

"కనిపించకేం ... రోజూకి ఒకసారైనా కనిపించక తప్పదు."

"నీకేం పల్కరించడంలా"

"నాకేలా పల్కరించడానికి గొంతు పెగుల్తుంటుయి. యిప్పటికి మూడునాల్గు రోజుల క్రితం ఆ కూల్ డ్రింక్ షాపుముందు కనిపిస్తే —

"అంతా కులాసాయేట్రా"? అంటే - కులాసాగాదు. అంతే.

"వాడొక్కడేవున్నాడా! యింకా యెవరైనా వున్నారా!"

"ప్రక్కన యెవరో ఒకతను పొడుగ్గా యెర్రగా వున్నాడు. యింకా యిద్దరు యిఁచుమించుగా వాడెత్తేవున్నారు. —"

"మీరు ఏ సైకిలు దిగకుండానో పల్కరించి వుంటారు అంతేనా? "

"అదైనా, ఆఫీసునుంచి వస్తుంటే కనిపించాడు కాబట్టి ఆ కాస్తయినా పల్కరించా. లేకపోతే ..."

"అదేమిటండీ! కాస్తదగ్గిరవెళ్లి పల్కరిస్తే తప్పేముంది? అసలెందుకు వేరుగావుంటున్నాడో తెలిసేదిగా!"

"ఏమిటీ మరీ పిచ్చిదాన్లాగా మాట్లాడుతున్నావ్! వాడు వేరుగా వుంటున్నాడని నేనేమైనా కలగన్నానా? అయినా అంతమందిలో యువతలను పిల్చి-అడిగినా - యీ విషయం యీ కాస్తయినా చెప్పతాడని నమ్మకం యేమిటి?

"అదేమిటీ! మరీ అంటారు మీరడిగితే తప్పకుండా చెబుతాడు. చెప్పకుండా యెప్పటికీ తప్పదు."

"అని యేమిటి ధైర్యం? "

"ధైర్యం కాదండీ! మీరు మరీను! మీరంటే వాడికి గౌరవంవుంది, తెలుసా!"

"వుంటిదే..."

"కాబట్టి..."

"అడగకుండాన్"

"మీయిష్టం..."

"అటువంటప్పుడు, బజారులో కలుసుకున్నప్పుడు యీ విషయం యెత్తడం కంటే, ఒక సారి వాణ్ణే మనింటికి రమ్మంటే వస్తాడుగా — అప్పుడు యెవరైనా అడగొచ్చు... ఏమంటావ్"?

"ఏమనేదేముంది. అలాగే రమ్మన్నానని చెప్పండి."

"నువ్వురమ్మంటేనే వస్తాడన్న మాట. నేరమ్మంటే రాడా"?

"అబ్బ! పోనీ, మీరేరమ్మన్నారని చెప్పుకోండి. యీమాత్రం దానికి వంతులెందుకు? యెవరు చెప్పారనుకున్నా, వాడురావాలికదా! రేపు తప్పకుండా చెప్పండి ... మరిచిపోరుగదా!"—అని భువనేశ్వరి అంటూంటే, దూరదూరమవుతున్నకొద్దీ మరీమరీ వినిపించేమాటలు అస్పష్టంగా వుండటంవల్ల ఆనంద్ మోహన్ సైకిలు ఆ వీధి మలుపులోకి వెళ్లిపోయింది. ప్రతిరోజూ ఆనంద్ మోహన్ ఆఫీసుకు వెళ్ళగానే భువనేశ్వరి యేదో అల్లికలల్లుకొంటూనో, క్రొత్త క్రొత్త ముగ్గులు నేర్చుకొంటూనో, చక్కని మంగళహారతి పాటలు పాడుకొంటూనో, మొత్తానికి యేదో యిటువంటి పన్లో, లేక యింటిపన్లో చేసుకొంటూం డేది. ఎదురింటి సువర్చల రోజూ రావడం జరుగుతూంటుంది. ప్రొద్దు పోవడానికి మాటలు చెప్పుకొంటూ పనులేవరివివారు, అవసరపడితే ఒకొరికొకరు సాయపడుతూండేవారు. అత్తింటివార్ని, పుట్టింటి వారిని గురించికూడా యిద్దరూ చెప్పుకొంటూండేవారు.

ఆనాడు ఆనంద్ మోహన్ వెళ్ళిన అరగంటకు సువర్చల తలదిండు గలీబూ, మీద రెండు నెమలి బొమ్మలు అల్లుదామని రంగురంగుల దారపు కండెలు, సూది, మొదలైన సరికరాలతో భువనేశ్వరి దగ్గరికి వచ్చింది. కళకళలాడుతూ గృహలక్ష్మిలాగా కనిపించే భువనేశ్వరి, గలగలలాడే, మాసిన చీర కట్టుకొని, నొసటను చెరిగిపోయిన కుంకుమచారికలు రెండు కనుబొమల మధ్య, రొండిపోయిన వదనంతో, దీనంగా కనిపించేసరికి సువర్చలకు యేమని పలకరించాలో అర్థం కాలేదు. ఒక్కయిదు నిముషాలాగి—

"భువనా"! అంది మెల్లగా.

వంటవసారాలో తలుపు ప్రక్కగా యేదో ఆలోచిస్తున్న భువనేశ్వరి ఉలిక్కిపడి ఆలోచనల తెరలనుండి బయటపడి, పమిటి చెంగుతో మొగంతుడుచుకుంటూ—

"ఊఁ...యేమిటే!" అంది.

"అలావున్నావేం?"

"ఏంలేదు."

"ఏంలేదంటావేం. ఎందుకో బాధపడుతున్నావ్. యేంలేకపోతే యెందుకిలావున్నావ్ యేదోవుంది. చెప్పవుటే! భువనా"

"ఏంచెప్పనే. అంతా అయోమయంగావుంది యేంతోచడంలా.—

కార్తీక పౌర్ణమినాటి రాత్రి పుట్టాడుకదా అని తొమ్మిది సంవత్సరాలక్రిందట చనిపోయిన మా తాతయ్య, మా అన్నయ్యకి "రజనీకాంతుడు" అని పేరుపెట్టాడు. వాడు పుట్టినదగ్గరనుంచీ, మా తాతయ్యకు ప్రతివిషయంలోను లాభం కనిపించడం జరుగుతోందని పరిచయమైన వాళ్లందరితోను చెప్పుకునేవాడు. మాతాతయ్య మహాకవి, పండితుడు, హరికథలుచెప్పేవాడు, మద్దెలవాయించేవాడు. ఆయన యేసభకు వెళ్లినా వాన్ని వెంట తీసుకొని వెడుతూండేవాడు. వాడంటే ఆయనకు ప్రాణం; దానికన్నా కూడా తియ్యగా చూసుకునేవాడు. వాడి చిన్నతనంలో మా తాతయ్యే బాయిలర్ వేసి, నీళ్ళు కాగేంతవరకూ దగ్గర కూర్చొని మంటవేసి, బాగా కాగనిచ్చి, వేడి నీళ్లు—చన్నీళ్లు సమపాళంగా తానే స్వయంగాచేసి, ఆ పని జరిగినంత సేపూ తగిలితే జ్వరం కలుగుతుందో ఆలోచించి మరీ పోయనిచ్చేవాడు. ప్రతిరోజూ స్నానమైన తరువాత, వెంటనే సాంబ్రాణి పొగవేసి, పూపట్టి, యిస్త్రీ బట్టలు తొడిగి, ఆయన షికారుకు వెళ్ళబోయేముందు చంక కందివ్వాలి. అలా జరగని రోజున ఆయన కెక్కడిలేని కోపంవచ్చి యింటిల్లపాదిని చెడామడా తిట్టిపోసేవాడు. యింత కష్టపడి గారాబంగా పెంచినందుకు మా తాతయ్య గుణాల్లో "కవిత్వం" అనేది అబ్బిందని మా నాన్నగారు అంటూండగా నేను రెండుమూడుసార్లువిన్నాను. తరువాత మా పెద్ద, చిన్న తాతయ్యలు — మా అమ్మమ్మలు— బామ్మలు అంటూండగాకూడా విన్నాను. వాడు వ్రాసినవికూడా విన్నా. చదివానుకూడా. బాగానే వున్నట్లు తోచాయి. నేనే ఒకసారి వూరుకోక "అదేంకథరా అన్నాయ్" అన్నా ఒక కథ చదివి. "అది అంతేలే...!" అన్నాడు. "అదేమిటిరా?" అని అడగబోతూండగా యేదో చెప్పడం మొదలెట్టాడు. కాని నాకేంఅర్థంకాలేదు. మా అన్నయ్యకు కవిత్వం అబ్బడంలోనూ, మా నాన్నకు మృదంగం అబ్బడంలోనూ, మాతాతయ్య మా యింట్లో యింకా సజీవుడై వున్నాడనే అనుకొంటాం. భౌతికంగా మనిషి కనిపించక పోతున్నాడుగాని, అంతర్యంలో ఆయన పవిత్ర ప్రతిమ ప్రతిబింబిస్తూనే వుంటుంది. ఒక్క మా యింట్లోనే కాదు. అందరి బంధువుల యిండ్లలోనూ ఆదరణీయుడే. ఆయన రచించిన 'వేణుగోపాల శతకం' పఠించకుండా యెవరూ యేనాడూ వుండలేరు. నిజంగా మా అన్నయ్య బ్రతికినట్లు, వాడికి జరిగినట్లు మేమెవ్వరం తరువాత అనుభవించలేకపోయాం. వాడంటే మా చుట్టాలంతా యెంతో ఆప్యాయంగా చూసుకొంటారు. అయిదో తరం మా వంశానికి వాడే మొదటివాడని, యెంతో గౌరవంగాకూడా చూస్తూంటారు. చమత్కారంగా, నిష్కల్మషంగా మాట్లాడతాడని కబుర్లుచెప్పుమని మా

వాళ్ళంతా కొసరి కొసరి పుణికి పుణికి అడుగుతారు. వాడూ మొదలుపెట్టేడంటే అదేదారి. విసుగూ_విరామం లేకుండా చెప్పుకుపోతూంటాడు.

మా అన్నయ్యంటే మా కెంతో భయం. వాడికి కోపం వచ్చిందంటే ఒళ్ళూపై తెలియదు. ఒకవేళ మేమేదైనా తప్పుచేస్తే కొడతాడు; తిడతాడు. [illegible] యేడుస్తాడు. ఒక్కోసారి ఏడ్వడం కూడ కద్దు. వూరికే కూనిప్రుగా వుండేవాడు కాడు. యేవో చదువుతూనో, లేకపోతే యే పూలమొక్కలకు పోషణచేస్తూనో వుండేవాడు. ఒక్కొక్కమారు ప్రొద్దు పోయేదాకా మేల్కొని వ్రాస్తూండేవాడు. అప్పటికి మేం ఒక నిద్రతీసేవాళ్ళం. "పొద్దుపోయింది పడుకోరాదురా" అంటే, అన్న అరగంటకో, గంటకో లేచి వెళ్ళి పడుకునేవాడు. వూరికే వున్నాడనుకుంటూమా! యేదో ఆలోచిస్తూవుంటాడు. నిజంగా వాడే వాడు, వాడిరెక్కలమీద కష్టపడి బ్రతుకుతున్నాడని అందరం అనుకొంటూంటే, చూస్తూ చూస్తూండగానే మా అమ్మ నాన్నని వదలిపెట్టి వేరుగా వుంటున్నాడంటే నాకెంతో బాధగావుంది."

"పెళ్ళయిందా! మీ అన్నయ్యకి?"

"లేదేయింకా! యీ మధ్య మూడు నాల్గు సంబంధాలొచ్చాయి." "ఎలావుందిరా పిల్ల?" అంటే "బాగానేవుంది కాని ..." అని యేమో చెప్పాడు. యిట్లా వచ్చిన సంబంధాలన్నిటికి జవాబు యిలాగే చెప్పాడు. చూసొచ్చినవాళ్లంమాత్రం అనేకరకాలుగా అనుకొంటుంటే, అదంతా వినలేకకాబోలు మా దగ్గర నుంచి లేచి వెళ్ళిపోయేవాడు. ఒకసారి మా మేనత్తగారు "యేరా! రజనీ! చూసినపిల్లలెవ్వరూ నీకు నచ్చకపోతే యింకెవ్వరురా నచ్చేది?" అని అడిగింది. వాడికి యెందుకో నవ్వొచ్చింది ఆ ప్రశ్న అడగంగానే. ఆ నవ్వుకి అర్థం యింతవరకూ నాకేం బోధపడలేదు. వాడికి చిన్నప్పటినుంచీ పట్టుదల మహా యెక్కువ. మా నాన్నతోకూడ ఎక్కువ మాట్లాడేవాడు కాడు. ఏవైనాకావాలంటే మా అమ్మద్వారా ఆయన చెవులకు వినిపించాల్సిందేగాని, వాడు యేమైనా సరే అడిగేవాడు కాదు. అటువంటిది యీనాడెందుకు వాడిలా వేరుగా జీవితాన్ని గడపాలను కొంటున్నాడో నాకేమీ తెలియటంలేదు. [illegible] కారానికి రెండుమూడుసార్లైనా వస్తూపోతూండేవాడు మా యింటికి; యీ మధ్య బొత్తిగా రావడమే మానేశాడు. నేనుకొంటూనేవున్నా "ఏమో! వీడు [illegible]" అని "యిప్పటికి అర్థమైంది యెందుకు రావటంలేదో." అని భువనేశ్వరి తన ఆవేదనంతా చెప్పుకుపోతూండగా టేబిల్ మీద గడియారం ఒంటిగంట చూపించింది. సువర్చలకు యేమని ఓదార్చాలో పాలుపోక_

"భువనా! ఒంటిగంటయింది యికనైనా లేచి భోంచెయ్యి" అంది

"ఏమోనే! తినబుద్ధికావటంలేదు."

"అదేంటే! యెంగిలి పడకపోతే, వేసంకాలం మరీ వడియంలాగా తయారవుతావ్. లేచి కాస్తతిను. ... ముందు లే ...... నువుస్నానంచేసిరా! నేను వడ్డిస్తాను పోనీ ... !"

సువర్చల బలవంతంమీద భువనేశ్వరి స్నానం చేయడానికి వెళ్ళిపోయింది. నూడి దారవుండలు, గరిబాగుడ్డ టేబిల్ మీద పెట్టి వంటయింట్లోకి వెళ్ళి సువర్చల అన్నం వడ్డించడానికి ప్రయత్నం చేయడం మొదలెట్టింది.

సువర్చల - భువనేశ్వరి స్నేహం కృష్ణా తుంగభద్రల కలియకవలె, గంగాయమునల సంగమంవలె యిప్పటికి రెండుసంవత్సరాలనుంచి మేళవించబడి వుండిపోయింది. ఒకరికొకరు చేయూతనిచ్చుకొంటూండటంబట్టి వాళ్ళిద్దరూ యేనాడో ఒకే రక్త సంబంధం కలిగిన వాళ్ళనిపిస్తుంది.

భువనేశ్వరి భర్త ఆనంద్ మోహన్, సువర్చల భర్త క్రాంతీనాథ్ ఒకే ఆఫీసులో పనిచేయడం - ఒకే పేటలో ఒకరియింటి కెదురుగా వొకరు వుండటం



6

వలన వారి వారి సుఖమయజీవిత ప్రతిబింబాలు స్పష్టంగా కనిపిస్తూనే వుంటయి.

భువనేశ్వరి చామనచాయ.

సువర్చల శ్యామలవర్ణం.

ఆనంద్ మోహన్ ఎర్రనివాడు.

క్రాంతీనాథ్, ఆనంద్ మోహన్ కంటెటె యెరుపు కాడు. నిశ్చలంగావున్న నీటిమీద చిన్నగాలి సోకితే కదిలి బయలుదేరిన అలలమాదిరిగా వుంటుంది భువనేశ్వరి తలకట్టు.

అశోకవృక్షపు ఆకు కిరుప్రక్కల వంపులవలె వుంటుంది సువర్చల తలకట్టు.

ఇద్దరూ వాలుజడలు వేస్తారు.

ఇద్దరూ మధ్యపాపిడీ తీస్తారు.

సువర్చల భువనేశ్వరికన్న జెత్తెడెత్తు తక్కువ.

భువనేశ్వరి మొగంలో అజంతా శిల్పం కనిపిస్తూ వుంటుంది.

సువర్చల మొగంలో హంపీశిల్పం కనిపిస్తుంది.

ఆనంద్ మోహన్ అంటే భువనేశ్వరికి యెంత మమకారమో, అంతకు సరిసమానంగా క్రాంతీనాథ్ అతన్ని గౌరవిస్తాడు. ఆమెను సహోదరిగా చూసుకొంటాడు.

సువర్చలంటే క్రాంతీనాథ్‌కి యెంతటి అనిర్వాచనీయమైన మధురభావంవుందో, భువనేశ్వరికి దానికి రెట్టింపుమిన్నగా అతన్ని అన్నగారుగా చూసుకొంటుంది.

ఆనంద్ మోహన్ క్రాంతీనాథ్‌ని 'బావా' అని వేళాకోళంగా సంబోధించినప్పుడు సువర్చల, ఆనంద్ మోహన్ యెడల సహోదరత్వంలోని మహత్తర భావమాధుర్య మమకారాన్ని అనుభవించడానికి ప్రయత్నిస్తుంది.

## 2

ఆనాడు పౌర్ణమి. రజనీకాంతుడు ఒంటరిగా కూర్చొని గదిలో యేదో వ్రాసుకొంటున్నాడు. షుమారు పదకొండుగంటలు కావొస్తోంది. తీర్చి కాస్తున్న వెన్నెలలో రజనీకాంతుడు హాయిని పొందలేకపోతున్నాడు. కాల్చి, కాల్చి నోరుమంటెత్తుతున్నా, కొసలవరకూ కాల్చకుండా యే సిగరెట్టును విడిచిపెట్టలేకపోతున్నాడు. చుట్టూవున్న యిళ్ళల్లోని వారంతా నిశ్శబ్దంగా పడుకున్నారు. రజనీకాంతుని గది ఆ వూరిచివర, కాలవగట్టుకి మూడున్నర వందల గజాలదూరంలోవుంది.

తలుపుకొట్టిన చప్పుడు ఆ సమయంలో హఠాత్తుగా వినిపించింది. ఆ వినిపించడం అతనికి యేగాలి తప్పెట్లశబ్దమో అని వూరుకొన్నాడు. నిజంగా అటువంటి శబ్దం ఆ వేళప్పుడు మ్రోగదంకద్దు. మళ్లా మ్రోగింది.

"ఎవరూ ?" - అన్నాడు.

"నేనే ..." - అన్నస్వరం గుర్తుపట్టాడు. గబాలునవెళ్ళి తలుపుతీస్తూ-

"రాగవర్ధనీ ! యేమిటీ రావడం" - అన్నాడు.

"యేముంది రావడానికి. భయమేసిందా ?" అంది.

"యీ వేళప్పుడా వచ్చేది !"

"రావాలనిపించింది వచ్చేసాను"-

"వస్తానని కబురుకూడా చెయ్యలేదే !"-

"నేను మాత్రం అనుకొన్నానా ! వస్తానని. ఒకనిద్ర తీసాను. మెలకువ వచ్చింది. యిక యెంత ప్రయత్నించినా కునుకుపట్టలేదు. యేంతోచలేదు. యేంచేయను ? మెల్లగాలేచి వచ్చేసాను."

రజనీకాంతుడు అంతావింటూ నెమ్మదిగావెళ్ళి తలుపులు వేసివచ్చాడు ... ఒక సిగరెట్టు వెలిగించి,

"ఏమిటి కబుర్లు" - అన్నాడు.

"అలా వున్నారేం" అంది రాగవర్ధని.

"ఏం. ఎలావున్నా ! బాగానే వున్నాగా."

"చిక్కిపోయారేం ! ..."

"చిక్కడమా ! లేదే ..." అని యిక చెప్పడానికి యిష్టపడలేదు.

రాగవర్ధనికి ఆ అసంపూర్తి వాక్యం ఆందోళన కలిగించింది. 'రజనీకాంతుని హృదయేశ్వరి'నని లోకమంతా చాటుచాటుగా అనుకొంటుంటేకూడా ఆమె యింతగా జంకుపడలేదు, భయపడలేదు, కాని యీ వాక్యం, యేజంకూ, గొంకూ ఎరుగని హృదయానికి యీ నాడు ఆందోళన కలిగించిందంటే ఆశ్చర్యంగానే వుంటుంది.

"ఏమీ లేదని దాస్తారెందుకు? నాతోకూడా చెప్పకూడదా!" అంది రాగవర్ధని.

కళ్లజోడుతీసి, తుండుగుడ్డతో ముఖం తుడుచుకొంటూ,

"ఆకలి చచ్చిపోతే అన్నం తినడం మానేశాను" అన్నాడు రజనీకాంతుడు.

రాగవర్ధనికి మరీ ఆశ్చర్యం - ఆదుర్దా యెక్కువయినయి. "ఆకలి చావడమేమిటి?" "ఆకలి యెందుకు చస్తుంది?" "యెప్పుడు చస్తుంది?" "అసలు చావడానికి కారణం?" యిత్యాది ప్రశ్నలు ఒకదానివెంట వొకటి పరుగెత్తుకొంటూ వచ్చాయి.

"నాకేం అర్థంకావడంలా మీ మాటలు."—

"అర్థమయ్యేటట్లుగా చెప్తే, అనవసరంగా బాధపెట్టినవాణ్ణి అవుతా! నిన్ను చూస్తూ చూస్తూ బాధపెట్టడం నాకిష్టంలేదు వర్ధనీ!"

"అంటే ... !"

"అంటే . . నేను . . యింటికి . . వెళ్ళి . . భోజనంచేయడం...మానివేశాను .. జీతాలు యింకా రాలేదు. ఒక వారంలో వస్తాయి...." అన్నాడు.

"ఎన్నాళ్లయింది యింటికెళ్లకుండా మానేసి?—" అంది.

"ఒక వారం అవుతుంది."

"అప్పటినుంచీ భోజనం లేకుండానే వున్నారా!"

"ఏంచేయను?"

"మొన్నొచ్చినప్పుడు మరి నాతో చెప్పలేదేం?"

"ఎందుకు?"

"ఎందుకేమిటి! బాగుంది. వారంరోజులనుంచి అన్నం తినకుండా, అవి యివి చిరుతిళ్లుతిని, కాఫీలు త్రాగుతూంటే ఆకలి చావక యేంచేస్తుంది చెప్పండి. కనీసం కబురు పంపినా చాలుగదా! మా పాపకిచ్చి క్యారియర్ పంపేదాన్ని. ఎలా వుండగలుగుతున్నారండీ! మరి ఆఫీసులో యెలా పనిచేస్తున్నారు!" "ఏం చేయను. తప్పుతుందా! యేదో సామెత చెప్పినట్లు మంత్రసానితనం వొప్పుకున్న తరువాత యేదొచ్చినా చేయాలి." —అన్నాడు రజనీకాంతుడు.

"యేమైనా పోట్లాడుకొన్నారా!" అని అడిగింది రాగవర్ధని.

"పోట్లాడుకోలేదుగాని, మనస్పర్థలు — మాటపట్టింపులు వచ్చాయి!" అన్నాడు రజనీకాంతుడు.

కూర్చున్న రాగవర్ధని చటుక్కున లేచి, యిప్పుడే వస్తానంటూ వెళ్ళిపోయింది.

రజనీకాంతుడు తెల్లపోయాడు—ఆ వెళ్ళిపోవడం చూసి.

గుమ్మంలోకి వెళ్ళి, వెళ్లే రాగవర్ధన్ని పిలుద్దామనుకొన్నాడు. కాని కుర్చీలోంచి, లేచి వెళ్ళలేకపోయాడు. అలాగే చతికిలబడి మళ్ళా వ్రాద్దామనుకొని ప్రయత్నించాడు. కాని ఆ భావాలు క్రొత్తవిగా కనిపించి, సందర్భోచితంగాలేవు. తర్వాత యేదో వ్రాద్దామని ఉంకించాడు. కలం సాగలేదు. ఆలోచనలు మాలతీ లతల్లాగా అల్లుకొంటున్నాయి. అప్రయత్నంగా అతని నోటివెంట 'రాగవర్ధనీ-రాగవర్ధనీ' అని రెండుసార్లు పిలుచుకొన్నాడు. హృదయం బావురుమని యేడ్చింది. రెండు—మూడు కన్నీటిబొట్లు కూడా తెల్లకాగితంమీద టపీ, టపీమని పడ్డాయి.

'రాగవర్ధని'ని రజనీకాంతుడు ఆరాధ్యదేవిగా భావిస్తాడు.

ఆమెపట్ల ఆతని హృదయం రూపనవతీతంలో రంగరించుకొని వుంటుంది.

'ఆనందం' అంటే యేమిటో యెరుగని జీవితానికి నందనోద్యానంలో విహరింపచేసి అనూహ్యమైన మధురానందం చవిచూపించింది తొలిసారిగా రాగవర్ధనే.

ప్రపంచంలో 'ఆనందం' అంటే యేమిటో తెలుసుకొంది. రాగవర్ధని గాంధార శిల్పసౌందర్యంవల్లనే తన పట్ల, పరితాప హృదయానికి పరమ సంతోషం కూర్చగలిగింది అనురాగ లలనామణి రాగవర్ధనే."

యీ అనుభూతిని రజనీకాంతుడు ముఖతా వ్యక్తం చేస్తుంటే, ఒక నవరసభరితమైన కావ్యం చదివినట్లుగా వుంటుంది. అందుకే అలంకారికులు అన్నారేమో "వాక్యం రసాత్మకం కావ్యం" అని

రాగవర్ధన్ని ప్రేమిస్తూన్నానని తనలో తానెప్పుడు రజనీకాంతుడు అనుకోలేదు. కాని ఆమె అంటే అతనికొకవిధమైన మధురభావం — వెలకట్టలేని నమ్మకం వుంది. అది 'యీ విధమైనటువంటిది' అని వ్యక్తం చేయలేదు. ఒకవేళ అది వ్యక్తం చేయడానికి ప్రయత్నిస్తూన్నాడని వూహించుకొంటే మనకు వినిపించేది "ప్రేమిస్తున్నాననే" ధ్వని. యీ ధ్వనికి హృదయంలో వుండే ధ్వనికి వున్న వ్యత్యాసం తెలుసుకోవడమే జరిగితే అతని మనస్తత్వం అవగాహన కాక మానదు. తనకు తానై తన ఆలోచనలలోని వుద్రేకాలను [illegible] తలంపులు ప్రోగుచేసుకొని 'రాగవర్ధని' కర్తవ్య[illegible] లోపలికి వచ్చేసింది. ముసురుకొన్న ఆలోచనల్లోంచి రజనీకాంతుడు దూసుకొచ్చి

"వర్ధనీ! యేమిటిదంతా!"— అన్నాడు.

"యివంతా యేమిటో [illegible], ముందు లేచి భోంచెయ్యండి." అంటూ తెచ్చిన అరిటాకు కడిగి, ఆలమారలోంచి గ్లాసు తీసి, కూజాలో మంచినీళ్లు అందులో పోసి, .

"కూర్చోండి"— అంటూ క్యారియర్ గిన్నెలోని వంటకాలన్నీ ఆకు చుట్టూర పెట్టుకొంటూ వస్తోంది.

రజనీకాంతుడు ఒక్క నిముషంసేపు, తలవంచి వడ్డిస్తున్న రాగవర్ధని మొగంవంక తృప్తిగా చూసి "నీ ఋణం తీర్చుకోలేను వర్ధనీ!" అన్నాడు మృదువుగా.

(సశేషము)

— o —

మే నెల 26వ తేదీన మద్రాసులో కలవలకణ్ణాన్ చారిటీస్ వారి భవనమున శ్రీ శింగరాజు రామలింగశాస్త్రి గారి అధ్యక్షతన జరిగిన విద్వత్ సభలో కోటసోదర కవిచంద్రులు తమ రచనలు 'మాతృశ్రీ, కర్ణక ప్రబోధము' మొదలగు గ్రంథములలోని కొన్ని భాగములను చదివి వినిపించుటతో బాటు అష్టావధానము చేసిరి. అధ్యక్షుల ప్రశంసలతో బాటు చారిటీస్ వారు అర్ధనూట పదహార్లను కవిచంద్రులకు బహూకరించిరి.

డాక్టరు కే. యన్. కేసరిగారి రచన

'నా చిన్ననాటి ముచ్చట్లు'

వెల రు. 3–0–0

అన్ని హిగిన్ బాదమ్స్ స్టాల్సులోను దొరుకుతవి.